క్లుప్తంగా

గమళ్లపాళెంలో పశువైద్య శిబిరం



తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండ పంచాయతీ గమళ్లపాళెం గ్రామంలో మంగళవారం జరిగిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వర్ణభారత్-మండవ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ఎదకు రాని 15 గేదెలకు గర్భకోశ చికిత్సలు, 19 గేదెలకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. అలాగే 62 దూడలకు నట్టల నివారణ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైద్యాధికారి శ్రీనివాసులునాయుడు, స్థానిక గోపాలమిత్ర వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ గోపాలమిత్ర శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నరసాపురం విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఇందుకూరుపేట : ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్‌ను మంగళవారం అభినందించారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.జ్యోతి 600 మీటర్ల లాంగ్ జంప్‌లో విజయం సాధించగా, అండర్-16 విభాగంలో లాంగ్ జంప్, హైజంప్‌లో పదో తరగతి విద్యార్థిని పి.ఇందు విజయాన్ని అందుకున్నారన్నారు. దీంతో వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారని వివరించారు.

కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

- కలెక్టర్ ఆనంద్



ఇందుకూరుపేట : కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారించవచ్చని, అందుకు ముందుగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని కొత్తూరులో వీపీఆర్ ఫౌండేషన్, టీటీడీ సిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే మొబైల్ బస్సును కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ వాహనాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.


కారు ఢీకొని వ్యక్తి మృతి

వెంకటాచలం : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని బురాన్‌పూర్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీకి చెందిన ఏకొల్లు చెంచయ్య(45) బురాన్‌పూర్ వద్దనున్న ఓ కంపెనీలో పని చేస్తున్నారు. కంపెనీ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో బురాన్‌పూర్ వద్ద హైవేను దాటుతుండగా గూడూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చెంచయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు బురాన్‌పూర్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురికి కూపంలా వ్యవసాయ కాలువ

ఎనిమిది వేల ఎకరాలకు సాగు నీరందించే కాలువ ఇది. నార్తురాజు పాళెం మీదుగా వెళ్తుండడం దీనికి శాపంగా మారింది. ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెంది భూముల విలువ పెరగడంతో కాలువను సైతం ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేసేశారు. ఈ ప్రాంతంలో 80 శాతం కాలువ ఆక్రమణ చెరలో చిక్కి కుచించుకుపోయింది. పైగా ఇక్కడి కాలువకు ఇరువైపులా దుకాణాలు ఉండడంతో చికెన్ వ్యర్థాలు మొదలుకొని చెత్తా చెదారాలు ఇందులోనే వేస్తున్నారు. దీంతో ఈ కాలువ ఆనవాళ్లు కోల్పోయి మురికి కూపాన్ని తలపిస్తోంది.

- మరోపక్క 80 శాతం ఆక్రమణలు
- దుస్థితిలో తలమంచి కాలువ
- వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం
- రైతుల్లో ఆందోళన



మెయిన్ రోడ్డుకు పడమర వైపు తలమంచి కాలువను ఆక్రమించి చేపట్టిన శాశ్వత నిర్మాణాలు



నార్తురాజుపాళెంలో మెయిన్ రోడ్డుకు తూర్పు వైపు ఆక్రమణలతో కుచించుకుపోయి చెత్తతో నిండిపోయిన తలమంచి కాలువ

కొడవలూరు : మండలంలోని తలమంచి కాలువకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీని కింద మండలంలోని కొడవలూరు, దామేగుంట, బసవాయపాళెం, గుండాలమ్మపాళెం, వెంకన్నపురం, తలమంచి, బొడ్డువారిపాళెం, నాయుడుపాళెం, పద్మనాభసత్రం తదితర గ్రామాల్లో 8 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కనిగిరి రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన సాగునీటి కాలువైన తూర్పు కాలువ నుంచి నార్తురాజుపాళెంలో ఈ కాలువ చీలి ప్రధాన కూడలిలో మెయిన్ రోడ్డును క్రాస్ చేసుకుని అనేక కాలువలకు సాగు నీరందిస్తూ మండలంలో చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ కాలువ నార్తురాజుపాళెం కూడలి గుండా మెయిన్ రోడ్డును క్రాస్ చేసి పోతుండడం శాపంగా మారింది. ఇక్కడి మెయిన్ రోడ్డు వెంబడి స్థలాలకు విపరీతమైన గిరాకీ ఉంది. ఈ ప్రాంతం వ్యాపార కూడలి కావడంతో అంకణం స్థలం రూ.10 లక్షల వరకు పలుకుతోంది. వ్యాపార కూడలి కావడం, స్థలాల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో కాలువకు ఇరువైపులా ఉన్న వ్యాపారుల కన్ను ఈ కాలువపై పడింది. దీంతో కాలువను సైతం ఆక్రమించేసి శాశ్వత భవంతులు నిర్మించేశారు. సుమారు 60 అడుగుల వెడల్పు ఉండాల్సిన కాలువ పది నుంచి పది హేను అడుగులకు కుచించుకుపోయింది.

చెత్త కుండీగా..

ఆక్రమణలతో వదలని వ్యాపారులు ఈ కాలువను చెత్త కుండీగా మార్చేశారు. కాలువకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు చికెన్ వ్యర్థాలు మొదలుకుని చెత్తా చెదారాలను ఇందులోనే వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కాలువ మురికి కూపంగా మారి దుర్వాసన చిమ్ముతోంది.

ఆయకట్టుదారుల్లో ఆందోళన

ఈ కాలువ దుస్థితిని చూసి ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. కుచించుకుపోయిన కాలువ ద్వారా తలమంచి, దామేగుంటలోని చివరి ఆయకట్టుకు సాగు నీరందడం కష్టంగా మారింది. గతంలో ఈ కాలువ ద్వారా సాగు నీరందక చివరి ఆయకట్టుదారులు పంటను అర్ధాంతరంగా వదిలేసుకున్నారు. వ్యర్థాలతో నిండిపోయి ఉన్న కాలువ ద్వారా సాగునీరు కలుషితమై పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయన్న ఆందోళన నెలకొంది.

తొలగించినా షరా మామూలే

పదేళ్ల క్రితం కాలువ ఆక్రమణ నేపథ్యంలో చివరి ఆయకట్టుకు సాగు నీరందకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో ఇరిగేషన్ అధికారులు సమస్యను తీవ్రంగా పరిగణించి ఆక్రమణలు కొంత మేర తొలగించారు. శాశ్వత నిర్మాణాలను సైతం కొంత కూల్చివేశారు. ఆ సమయంలో కాస్త గడువిస్తే తామే స్వచ్ఛందంగా వైదొలుగుతామని వ్యాపారులు నమ్మబలికారు. అధికారులు అవకాశం కల్పించారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు యథావిధిగా ఆక్రమణలు కొనసాగించారు.

అధికారుల ఉదాసీనం

ఇరిగేషన్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం ఆక్రమణదారులకు ఊతమిస్తోంది. సాగునీటి విడుదల సమయంలో రైతులు గగ్గోలు పెడితే కాలువలో పైపైనే పూడిక తీయించి కాలం గడిపేస్తున్నారే తప్ప ఆక్రమణల గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు ఏడాదికోమారైనా సాగునీటి కాలువలను పర్యవేక్షిస్తూ ఆక్రమణదారులను హెచ్చరిస్తుంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న అభిప్రాయం రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే తప్ప కాలువల వైపు కన్నెత్తి చూడకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

సాగునీరు ప్రశ్నార్థకమే



నార్తురాజుపాళెం వద్ద ఆక్రమణలతో తలమంచి కాలువ పూర్తిగా కుచించుకుపోయింది. కాలువ ఆరంభంలోనే కుచించుకుపోవడం వల్ల ఈ కాలువ ద్వారా వచ్చే అనేక కాలువలకు సాగునీరు పారడం కష్టం. చివరి ఆయకట్టుగా ఉన్న తలమంచికి సాగు నీరందడం ప్రశ్నార్థకమే. గతంలో రైతులకు నీటి విడుదల చేసినప్పటికీ నీరు పారక పంటను వదిలేశారు. ఈ పరిస్థితి తరువాత కూడా సంబంధిత అధికారులు మేల్కోలేదు. ఆక్రమణలు తొలగించడంతో పాటు వ్యర్థాలను పూర్తిస్థాయిలో అరికడితేనే సాగునీరు సవ్యంగా సాగుతాయి.

– జి.వెంకటశేషయ్య, ఆయకట్టు రైతు, గుండాలమ్మపాళెం

పట్టించుకోవడం లేదు



మండలంలో సింహభాగం ఆయకట్టు ఈ కాలువపైనే ఆధారపడి ఉంది. దామేగుంట సాగునీటి కాలువకు కూడా దీని ద్వారానే సాగు నీరందాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యమున్నప్పటికీ ఈ కాలువ నిర్లక్ష్యానికి గురవుతోంది. సంబంధిత అధికారులు నిర్వహణ గురించి పూర్తిగా పట్టించుకోవడం లేదు. ఆక్రమణల విషయంలో, వ్యర్థాలను నివారించే విషయంలో పట్టించుకోవడం లేదు. చివరి ఆయకట్టుగా ఉన్న మా ప్రాంతంలో సాగు నీరందడం కష్టమే. కాలువలో వ్యర్థాలు వేయకుండా నియంత్రించాల్సి ఉంది.

– సీహెచ్.శేషగిరి, రైతు, దామేగుంట

ప్రజల సహకారంతో చికెన్ వ్యర్థాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న మత్స్యశాఖాధికారి పొట్టెయ్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : చేపల సాగులో చికెన్ వ్యర్థాలు కలపకుండా అడ్డుకట్ట వేయాలంటే ఆయా గ్రామ ప్రజల సహకారం అవసరమని మండల మత్స్యశాఖ అధికారి పొట్టెయ్య అన్నారు. మండలంలోని మినగల్లు గ్రామంలో చేపలసాగు చేస్తున్న రైతులు, స్థానిక ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపల సాగు చేస్తున్న రైతులు చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తున్నట్లు గుర్తించామన్నారు. గ్రామంలో ఎవరైనా చికెన్ వ్యర్థాలు వేస్తుంటే స్థానిక ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు. వెంటనే అక్కడకు చేరుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పడుగుపాడు సొసైటీలో రక్తదాన శిబిరం



కోవూరు : కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖ అధికారి జి.గురప్ప మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కట్టా సుబ్రహ్మణ్యం, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. గునుపాటి ప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు విఫలం

- కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పొదలకూరు : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యాడని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నట్లు దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా హెచ్చరికలు చేసినా సీఎం ఎందుకు పట్టించుకోలేదో ప్రజలకు చెప్పాలన్నారు. చంద్రబాబు ఇల్లు మునిగిపోతుందని కలెక్టరేట్లో ఉన్నట్లు నటిస్తున్నట్లు విమర్శించారు. ఇప్పటికీ వరద బాధితుల ఆకలి కేకలు మిన్నంటుతూనే ఉన్నాయన్నారు. సరైన గవర్నెన్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారని, అపార అనుభజ్ఞుడైన చంద్రబాబు ఎందుకు ప్రజలను అప్రమత్తం చేయలేకపోయారో వెల్లడించాల్సిందిగా డిమాండ్ చేశారు. విపత్తును సైతం ప్రచారానికి వాడుకోవడం అలవాటుగా మారిందని, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గోదావరి వరదలు వస్తే సమర్థవంతంగా ఎదుర్కొని బాధితులను ఆదుకున్న వైనాన్ని గుర్తుచేశారు. ఉద్యాన పంటలు నీట మునిగాయని, ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాల్సిందిగా పేర్కొన్నారు. వరదలను రాజకీయం చేసి లబ్ధిపొందాలనే ఆలోచనను మానుకుని బాధితులకు ఆశ్రయం కల్పించాల్సిందిగా సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌ను నిందించడం, వైఎస్సార్‌సీపీ నాయకులకు లేనిపోనివి ఆపాదించడం మానుకోవాల్సిందిగా హితవు పలికారు.

కమనీయం కల్యాణం



పొదలకూరు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామనగర్ గేటు సెంటర్‌లో సోమవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ఇక్కడ హంస వాహనంపై వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ప్రతి ఏటా వినాయక చవితి సందర్భంగా యువకులు అత్యంత వైభవంగా వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.

ఐలమ్మకు నివాళి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : భూ పోరాటానికి నాంది పలికిన చిట్యాల ఐలమ్మ వర్ధంతిని బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి ఘన నివాళులర్పించారు. ఐలమ్మ సేవలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



వెంకటాచలంలో రాధాష్టమి వేడుకలు నేడు

వెంకటాచలం : వెంకటాచలంలోని రాధే రాధే కృష్ణ మందిరంలో బుధవారం రాధాష్టమి(రాధాదేవి పుట్టినరోజు) వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉదయం మూలవిరాట్ ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు హాజరు కావాలని కోరారు.

విజయవంతం చేయండి

మనుబోలు : ఈనెల 17న అంతర్జాతీయ డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో డీ వార్మింగ్ డే నిర్వహణపై మంగళవారం అధికారులతో చర్చించారు. నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. మండలానికి 8,600 మాత్రలు కేటాయించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొనాలని ఆదేశించారు. సమావేశంలో సీహెచ్‌ఓ రాజయ్య, ఏఓ రవికుమార్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన

కొడవలూరు : మండలంలోని రాచర్లపాడులో గర్భిణులు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషక విలువలపై అవగాహన అవసరమని సూచించారు. పోషకాహార లోపం తలెత్తితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. బిడ్డ ఆరోగ్యకరంగా ఎదగాలంటే విధిగా పౌష్టిక విలువ లున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, ఏఎన్‌ఎంలు జె.షీలమ్మ, వై.రాధిక, మహిళా పోలీస్ యు.హర్షవర్ధన, వీహెచ్‌సీ ఎస్కే.రేష్మా, ఆశా కార్యకర్తలు ఎం.సరిత, ఎం.కామాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.విజయలక్ష్మి, ఎ.అమరావతి, జి.రాజేశ్వరి, డి.కృష్ణవేణి, కె.చెంచమ్మ పాల్గొన్నారు.



కొడవలూరు : అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

పాతవంగల్లులో..

పోషకాహారంతో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని పాతవంగల్లులో పోషకాహారంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాలు పుష్కలంగా లభ్యమయ్యే పాలు, గుడ్లు, ఆకు కూరలు, చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లక్ష్మీబాయి, అంగన్‌వాడీలు యు.వెంకటరమణమ్మ, పద్మావతి, ఐ.విజయ, పి.మాధవి, ఆశా కార్యకర్త ఎం.మునీంద్రమ్మ పాల్గొన్నారు.

గౌరీపురంలో..

విడవలూరు : మండలంలోని వావిళ్ల సెక్టార్ గౌరీపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.రమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నరసమ్మ, భారతి, కామాక్షమ్మ, తిరుపతమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మహ్మదాపురంలో..

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం గ్రామ ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ వివరించారు. ప్రతి నెలా 10వ తేదీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు పరిశీలించుకోవాలన్నారు. ఏఎన్‌ఎం పెంచలమ్మ, ఆశావర్కర్ రత్నమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీలా, భారతీ, రాజేశ్వరి పాల్గొన్నారు.



కొడవలూరు : పాతవంగల్లులో..

పోషకాహారంతో రక్తహీనత దూరం

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు రక్తహీనత నుంచి బయటపడవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వెంకన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు మంగళవారం అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చేసి చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ముత్యాలమ్మ, రమణమ్మ, ఏఎన్‌ఎం ఇంద్రసేన, మహిళా పోలీస్ సునీత పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో పౌష్టికాహారం అందజేత

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్ :** పట్టణంలోని బెస్తపాళెం, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు మంగళవారం జరిగాయి. వైద్యాధికారి మనోజ్ పాల్గొని, గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ శకుంతల, మహిళా పోలీస్ లక్ష్మి, డాక్టర్ విష్ణు, ఏఎన్‌ఎం కామాక్షమ్మ పాల్గొన్నారు.



విడవలూరు : గౌరీపురంలో..



పొదలకూరు : మహ్మదాపురంలో..



మనుబోలు : వెంకన్నపాళెంలో..

వైభవంగా గణనాథుని ఉత్సవాలు

ముత్తుకూరు : మండలంలో వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతిష్ఠించిన విగ్రహాలకు మంగళవారం విశేష పూజలు ఆచరించారు. నిమజ్జన కార్యక్రమాలు లేకపోవడం వల్ల వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ముత్తుకూరు, పంటపాళెం, వల్లూరు, పిడతాపోలూరు, బ్రహ్మదేవి పంచాయతీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు.

విశేష పూజలు

మనుబోలు : మండలంలో వినాయక చవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన మనుబోలులోనే 25కు పైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించి గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు తూర్పువీధి మండపం వద్ద మొలకల హరనాథ్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. మరికొద్ది రోజులపాటు నిమజ్జనాలు కొనసాగుతాయి.

పేదలకు అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం విద్యాసదన్ వీధిలో వీఎస్ గణేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా సూరా ప్రసాద్‌రెడ్డి, కృష్ణవేణమ్మ వ్యవహరించారు. సాయంత్రం లడ్డూ వేలంపాట జరిగింది. రూ.18,300లకు తాటిపర్తి కీర్తి లడ్డూను దక్కించుకున్నారు.

- **వెంకటాచలం :** మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాల నిమజ్జనం సోమవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. తిక్కవరప్పాడు, కసుమూరు, నిడిగుంటపాళెం, సర్వేపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల వద్ద ఉదయం పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. తిక్కవరప్పాడులో వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటను యువత రూ.12 వేలకు దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం సాగింది.



మనుబోలు: పడమటి వీధిలో ఏర్పాటు చేసిన గణపయ్య



ముత్తుకూరులో మనోహరంగా అలంకరించిన భారీ గణపతి విగ్రహం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వేలం లడ్డూను అందజేస్తున్న కమిటీ సభ్యులు



వెంకటాచలం : తిక్కవరప్పాడులో యువత ఆనందోత్సాహం